సాక్షి ప్రకాశం

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



రమణీయం..
వేణుగోపాలుడి రథోత్సవం

తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది.

- 8లో..



ఎమ్మెల్సీ ఎన్నికల క్లెయిమ్‌లు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన క్లెయిమ్‌లు ఈనెల 15 నాటికి పరిష్కరించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30 /22

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన నూతన డీఈవో



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలసిన డీఈవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్

ఒంగోలు అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పిల్లి రమేష్ సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యా శాఖలో జిల్లాకు మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై ధ్రువపత్రాల పరిశీలన

ఒంగోలు: జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్లుగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రాతిపదికన నియమించేందుకు మంగళవారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో పిల్లి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్‌ఫిలప్ పాయింట్లలో భర్తీ చేసేందుకు స్కూల్ అసిస్టెంట్ లెక్కలు, బయోలాజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టుకు చెందిన సీనియార్టీ జాబితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఉంచారని, సంబంధిత ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

వాహన పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలి

● ఉప రవాణాశాఖ కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి

ఒంగోలు: జిల్లాలోని వాహన యజమానులు వారు రవాణాశాఖకు కట్టాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని రవాణాశాఖ ఉప కమిషనర్ భువనగిరి శ్రీకృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిల వివరాలను వాహనదారుల మొబైల్ నంబర్లకు వ్యక్తిగతంగా సమాచారం రూపంలో పంపారన్నారు. వెంటనే వారు వాహనాలకు సంబంధించిన త్రైమాసిక పన్ను బకాయిలను చెల్లించాలని, జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు పన్ను చెల్లించని వాహనాలను తనిఖీ చేయడం ప్రారంభించారన్నారు. పట్టుబడితే మోటారు వాహనాల చట్టం ప్రకారం భారీగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాల వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లను వారి వాహనాలకు బిగించుకోవాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తారన్నారు. పరిమితికి మించి ఓవర్ లోడు వేయరాదని, తాగి వాహనం నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం సరికాదన్నారు. బీమా పత్రాలు, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు వాహనంలో తప్పక అందుబాటులో ఉంచాలని, ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. మితి మీరిన వేగంతో వాహనాలు నడుపరాదని, రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని సూచించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ఒంగోలు: జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదివేందుకు పోటీపడాలన్నారు. సరోజినీ నాయుడ్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులతో పాటు రాజకీయాల్లో ప్రవేశానికి సైతం పునాదులు వేసుకోవాలన్నారు. ఎవరి ఉన్నతిని వారే కాంక్షించుకుంటూ అడుగులు కదపాలన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న సమయంలో దేశంలోని ప్రతి ప్రాంతంలో ఉన్న మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ బాలారిష్టాలను అధిగమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇందిర, సుధారాణి, ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి

ఎక్కుపెట్టిన తుపాకులు

అవి ఆంగ్లేయులు పాలిస్తున్న రోజులు. ఉప్పు మీద ఆంక్షలు కొనసాగుతున్న వేళ.. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఆ సమయంలో ఆంగ్లేయులు మనవాళ్లనే రక్షణ కోసం వాడుకున్నారు. 18 ఏళ్లు దాటి ధృడంగా ఉన్న యువకులను మిలిటరీ, ఉప్పు కొఠార్లు వద్ద జవాన్లుగా ఎంపిక చేశారు. ఆ నాడు అలా రక్షణ కోసం పడిన అడుగులు నేడు దేశ భక్తి వైపు నడిపించాయి. చిత్రమేమిటంటే పూర్వీకుల నుంచి వంశపారపర్యంగా ఈ కొలువులు చేస్తున్న వారి ఇంటిపేరు 'తుపాకుల'. దశాబ్దాలుగా దేశ రక్షణ వ్యవస్థలోనే అనేక విభాగాల్లో తుపాకుల వంశీయులు స్థిరపడి సేవలందిస్తున్నారు.ఆ వంశీయులే కాకుండా.. వారి అల్లుళ్లు సైతం ఇవే వ్యవస్థల్లో కొనసాగుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశ సరిహద్దుల్లోని ప్రతి బెటాలియన్‌లో తారసపడతారు. ఇంటి పేరును ఆయుధంగా మార్చుకుని వందలాది మంది తుపాకులు చేతపట్టారు. 'తుపాకుల' వంశం వివరాలు, వీరి దేశభక్తిని తెలుసుకుందామా మరి.



కనపర్తి గ్రామం వ్యూ



- ఇంటి పేరే చేతి ఆయుధంగా..
- బ్రిటిష్ కాలం నుంచే సాల్ట్ సెక్యూరిటీ, మిలిటరీ విభాగాల్లో ఉద్యోగాలు
- స్వాతంత్ర్యానంతరం దేశభక్తితో రక్షణ వ్యవస్థలో సేవలు
- మిలిటరీ, పోలీస్, ఎక్సైజ్, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ విభాగాల్లో విధులు
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ రక్షణ విభాగాల్లో వారసత్వంగా కొలువులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సముద్ర తీరప్రాంత గ్రామం కనపర్తి. దీనికి చారిత్రాత్మక గుర్తింపు ఉంది. పూర్వం ఈ గ్రామాన్ని కనకపురి పట్టణం అనేవారు. కార్తవరాయుడు పాలించిన గడ్డ ఇది. ముత్యాలు, వజ్రాలు, రత్నాలను కుప్పలుగా పోసి అమ్మేవారని పూర్వీకుల కథనం. ఇక్కడ పురావస్తు ఆనవాళ్లకు గుర్తుగా నంది విగ్రహాలు, బౌద్ధ మతానికి సంబంధించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతంపై బ్రిటీష్ వాళ్ల కళ్లు పడ్డాయి. కనపర్తి, పెదగంజాం, దేవరంపాడు ప్రాంతాల్లో ఉప్పు పండించేవారు బ్రిటీష్ పాలకులు. బకింగ్ హాం కెనాల్ నుంచి ఉప్పును తమ దేశానికి తరలించే వారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ తర్వాత కనపర్తికి పక్కనే ఉన్న దేవరంపాడులో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహానికి మహాత్మా గాంధీ వచ్చి స్వాతంత్ర్య సమర యోధులకు మద్దతు పలికారు కూడా. తమకు రక్షణగా ఉన్న బెటాలియన్‌లోకి, ఉప్పు పొలాల వద్ద రక్షణగా పనిచేసేందుకు స్థానికంగా ఉన్న తుపాకుల వంశీయులను గార్డులుగా నియమించుకున్నారు. వీరు దృఢంగా, భారీ కాయులుగా ఉండటంతో వారిని ప్రత్యేకంగా ఆ కొలువుల్లోకి తీసుకునేవారు. మరికొందర్ని బలవంతంగా బ్రిటీష్ మిలిటరీలోకి తీసుకెళ్లారు. బ్రిటీష్ హయాంలో కనపర్తిలో సాల్ట్ సూపరింటెండెంట్ కార్యాలయం కూడా ఉంది. ఆ సాల్ట్ కార్యాలయానికి ఎదురుగానే బ్రిటీష పోలీస్ క్వార్టర్స్ కూడా ఉండేవి. పోలీస్ క్వార్టర్స్ ప్రస్తుతం శిథిలమైపోయాయి. సాల్ట్ కార్యాలయం కూడా అవసాన దశకు చేరుకుంది.



కనపర్తి గ్రామంలో బ్రిటీష్ కాలంనాటి సాల్ట్ ఫ్యాక్టరీ ఆఫీసర్ కార్యాలయం

పోలీస్ విభాగంలో ఉత్సాహంగా చేరాం



"నేను చిన్నతనంలో ఊరికి మిలిటరీ, పోలీస్ డ్రెస్సులు వేసుకుని బంధువులు వస్తుండేవారు. అది చూసి చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలన్న ఆశ ఎక్కువగా ఉండేది. మా ముత్తాతలు మిలిటరీలో పనిచేశారు. ఆ తర్వాత మా తాతలు నలుగురు పోలీసులే. మా నాన్న వీర రాఘవయ్య పోలీస్ విభాగంలో పనిచేశారు. మా పెదనాన్నలు సుబ్బయ్య, రంగయ్య, వెంకటేశ్వర్లు కూడా పోలీస్ విభాగాల్లోనే పనిచేశారు. మా పెదనాన్నల కుమారులు, మా అన్నదమ్ములు పోలీస్ విభాగాల్లోనే పనిచేశారు. నేను ఎక్సైజ్ సెలక్షన్స్‌కు వెళ్లాను. మొదటి ప్రయత్నంలోనే ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ఎక్సైజ్ విభాగంలో ఏడాదిన్నర క్రితం ఎస్సైగా పదవీ విరమణ పొందాను. మా ఇంటి ఆడపిల్లల్ని అందరినీ పోలీస్ విభాగంలో పనిచేసిన వారికే ఇచ్చారు మా తల్లిదండ్రులు. అందరం సంతోషంగా ఉన్నాం."

- తుపాకుల చెన్నకేశవరావు, రిటైర్డ్ ఎస్సై, ఎక్సైజ్ విభాగం

మిలిటరీలో తొలి అడుగు తుపాకుల చెన్నయ్య ఆయన సోదరులు

1930 సంవత్సరానికి ముందు తుపాకుల చెన్నయ్య మొదటిసారిగా బ్రిటీష్ మిలిటరీలోకి వెళ్లారు. వాళ్లు నలుగురు సోదరులు. వాళ్లందరూ కూడా మిలిటరీలో దేశానికి సేవచేసిన వారే. తర్వాత ఆయన సంతానం పెద చెన్నయ్య, సోమయ్య, బంగారయ్యలు పోలీసులుగా విధులు నిర్వర్తించారు. ఆయనకు నలుగురు సంతానంలో తుపాకుల సుబ్బయ్య, రంగయ్య, వెంకటేశ్వర్లు, వీర రాఘవయ్యలు. వీళ్లందరూ కూడా పోలీసులే. ఈ నలుగురు సంతానంలో ఒక్కొక్క ఇంట్లో నలుగురు మొదలుకుని ఎనిమిది మంది వరకు పోలీసులుగా ప్రజలకు సేవలు అందించారు.

ప్రతి ఇంట్లో పోలీసులే...

కనపర్తి తోపు గ్రామంలో ఉన్న ప్రతి ఇంట్లో పోలీసులే కనపడతారు. తుపాకులతో పాటు ఆవుల, బొజ్జా అనే ఇంటిపేరు వారు కూడా తుపాకుల వారితో పోటీ పడి మరీ పోలీసులతో పాటు ఎక్సైజ్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ ఇలా యూనిఫాం విభాగాల్లోనే సేవలు అందించారు. కానిస్టేబుల్ మొదలుకుని ఏఎస్పీ వరకు అన్ని హోదాల్లో పనిచేసిన వారు ఇక్కడ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. గ్రామంలో ఎనిమిది వందల గడపలు ఉంటే యూనిఫాం లేని ఇల్లు ఉండదు. ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఏ నగరంలోనైనా, ఏ జిల్లా కేంద్రంలోనైనా తుపాకుల ఇంటి పేరు ఉన్న వారు పోలీసు కొలువుల్లో కనిపిస్తారంటే అతిశయోక్తి కాదు. తుపాకులు ఇంటిపేరుతో తుపాకీ పడితే ఆ కిక్కే... వేరుకదా

మిలిటరీ వాళ్లకు పెట్టింది పేరు కనపర్తి పెద్ద ఊరు



ఎస్.వెంకటప్పారెడ్డి, రిటైర్డ్ మేజర్

కనపర్తి తోపు తొలుత మిలిటరీ, ఆ తర్వాత పోలీస్, కాలక్రమేణా ఇతర యూనిఫాం విభాగాల్లో సేవలు అందిస్తే.. కనపర్తి పెద్ద ఊరు మాత్రం మిలిటరీ ఉద్యోగాలకు పెట్టింది పేరు. ప్రస్తుతం 150 మందికిపైగా దేశ సేవలో పునీతులవుతున్నారంటే ఆ ఉద్యోగాలంటే ఎంత మక్కువో అర్థమవుతోంది. ఆ గ్రామం నుంచి నలుగురు మిలిటరీలో కెప్టెన్లుగా పదవీ విరమణ చేసిన వారున్నారు. వారిలో తుపాకుల వంశీయులతో కలిసి పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మా, చైనా యుద్ధాల్లో పాల్గొన్న వారు కూడా ఉన్నారు. పులుగు వెంకటేశ్వరరెడ్డి, కుక్కల వెంకటేశ్వరరెడ్డి కెప్టెన్లుగా పనిచేశారు. వారు కాలక్రమేణా వయస్సు రీత్యా మృతి చెందారు. ఇకపోతే 33 సంవత్సరాల పాటు సేవలందించిన కుక్కల శివారెడ్డి, సూరిబోయిన వెంకటప్పలనాయుడు కూడా కెప్టెన్లుగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం చాలా మంది బయట ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు.



వెంకటేశ్వరరెడ్డి మిలిటరీ కార్డు (సర్టిఫికెట్)

ఏఎస్పీలుగా ముగ్గురు పదవీ విరమణ



తుపాకుల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ



ఆవుల సుబ్బారావు
రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ



తుపాకుల రామకృష్ణ
రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ

కనపర్తి గ్రామానికి చెందిన వారిలో ముగ్గురు ఏఎస్పీలుగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. వారిలో తుపాకుల రామకృష్ణ ఏఎస్పీగా రిటైరై తెనాలిలో కుటుంబంతో స్థిరపడ్డారు. మరొకరు తుపాకుల వెంకటేశ్వరరావు ఏఎస్పీగా రిటైరై గుంటూరులో ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో ఉన్నారు. ఇంకొకరు ఆవుల సుబ్బారావు ఏఎస్పీగా రిటైరై కాకినాడలో స్థిరపడగా, తుపాకుల మురళీకృష్ణ డీఎస్పీగా తిరుపతిలో పనిచేస్తున్నారు. ఇక సీఐ, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, అటు పోలీస్, ఇటు ఎక్సైజ్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. యూనిఫాం విభాగాలు కాకుండా ఇతర ప్రభుత్వ విభాగాల్లో కూడా పనిచేసిన, చేస్తున్న వారు కూడా ఉన్నారు.

ఆడపిల్లలను పోలీసులకే ఇచ్చి వివాహం

మొదటి నుంచి తుపాకుల వంశీయులు మిలిటరీ, పోలీస్ విభాగాల్లో పనిచేస్తున్నప్పటికీ వారి ఇంటి ఆడపడుచులను కూడా ఆయా విభాగాల్లో పనిచేస్తున్న వారికే ఇచ్చి సంబంధాలు కలుపుకున్నారు. ఆ విధంగా పుట్టినిల్లు, మెట్టినిల్లు యూనిఫాంలు ధరించే వారితో కలర్‌ఫుల్‌గా ఉండటాన్ని వారు కూడా స్వాగతించారు.

మా వంశం మొత్తం మిలిటరీ, పోలీసులుగానే



"మా వంశం మొత్తం మిలిటరీ, పోలీస్ విభాగాల్లోనే పనిచేశారు. మా ముత్తాత కూడా మిలిటరీలో పనిచేశారని మా తాత చెప్పేవారు. మా తాత రాఘవయ్య బ్రిటీష్ వాళ్ల వద్ద జవానుగా పనిచేశారు. మా నాన్న కోటయ్య 1939లో బ్రిటీష్ వాళ్ల వద్ద జవానుగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అర్హతను బట్టి మిలిటరీలోకి, పోలీస్ విభాగంలోకి, ఎక్సైజ్ విభాగంలోకి వేరే ఇతర విభాగాల్లోకి పంపించారు. నేను పోలీస్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 2010లో పదవీ విరమణ పొందాను."

- బొజ్జా కృష్ణమూర్తి, రిటైర్డ్ ఏఎస్సై, పోలీస్ విభాగం

ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఒంగోలు అర్బన్: రిజర్వ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఏటా ఫిబ్రవరిలో జరిగే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రకాశంభవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలోని అన్ని బ్యాంకుల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఆర్థిక ప్రణాళిక, ప్రవర్తన, బడ్జెటింగ్, పొదుపు, డిజిటల్ ఫైనాన్స్ సర్వీసెస్‌లపై అవగాహన కల్పిస్తారని ప్రజలు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. దీనిలో పలు బ్యాంకుల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల తనిఖీ

పామూరు: పామూరులోని వైఎస్సార్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను సోమవారం ఇంటర్మీడియెట్ బోర్డ్ త్రీమెన్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ బోర్డు సభ్యురాలు నాగమణి, పొదిలి జీజేసీ ప్రిన్సిపాల్ తారావాణి, మర్రిపూడి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటయ్య కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్డు ఆదేశాలతో కళాశాలను తనిఖీ చేసినట్లు నివేదికను బోర్డ్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి కళాశాలలను నిర్వహించాలన్నారు. వారి వెంట పామూరు జీజేసీ ప్రిన్సిపాల్ గుత్తి రమణయ్య పలువురు పాల్గొన్నారు.



కళాశాలను తనిఖీ చేస్తున్న ఇంటర్‌బోర్డ్ త్రీమెన్ కమిటీ

మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతు పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు శనగలు, మినుములు కనీస మద్దతు ధరకు మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనగలు క్వింటా రూ.5,335, మినుములు క్వింటా రూ.6,600 ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ–క్రాప్‌లో నమోదైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి సంబంధిత వీఏఏ, వీహెచ్ఏల ద్వారా సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో మినుములు, శనగ రైతులు పేర్లు నమోదు చేసుకునే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలన్నారు. దీంతో కొనుగోలు తేదీ రిజిష్టర్ మొబైల్ నంబర్‌కు సమాచారం వస్తుందన్నారు. రైతులు బ్యాంకు ఖాతాలకు లింకైన మొబైల్ నంబర్‌ను ఇవ్వాలన్నారు. శనగలు 14 శాతం, మినుములు 12 శాతం లోపు తేమశాతం ఉండేలా చూసుకోవాలన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.53 లక్షలు

సీఎస్‌పురం: మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,53,618 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.50,030, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.25,155 శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు రూ.57,317, ఆలయ మహా ప్రాకారం నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.5,116, ఇతర విరాళాలు రూ.16 వేలు వచ్చినట్లు వివరించారు.

ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న, కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్ కిషోర్

● డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్పందన సమావేశ మందిరంలో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలు ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ఆ విధంగా చేసినపుడు సమస్యలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ఏదైనా క్లిష్టతరమైన సమస్యలుంటే వాటిని అర్జీదారులను పిలిచి వివరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్వో ఓబులేసు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

☛ మర్రిపూడి మండలం పన్నూరు గ్రామానికి చెందిన కొండయ్య డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్‌చేసి తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని ఎన్నిసార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత తహశీల్దార్‌ను పరిష్కరించాలని ఆదేశించారు.

☛ పొన్నలూరు మండలం చెరువుకొమ్ముపాలేనికి చెందిన సింగయ్య తన పొలంలోకి వెళ్లకుండా కంచెను అడ్డుగా వేశారని పరిశీలించి తనకు పొలంలోకి వెళ్లేందుకు దారి చూపాలని కోరుతూ డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేశారు. పొన్నలూరు తహశీల్దారును విచారించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

☛ సంతనూతలపాడుకు చెందిన రాము డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తన కుమార్తె ఆరోగ్యం సరిగాలేదని వైద్యం చేయించేందుకు స్తోమత లేదని కలెక్టర్‌కు వివరించారు. వైద్య సదుపాయం కల్పించి తన కుమార్తెను కాపాడాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

17, 18 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ముద్దర్ల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు పోటీలను ప్రారంభిస్తారన్నారు. 17వ తేదీ సీనియర్ విభాగంలో, 18వ తేదీ ఆరు పండ్ల విభాగంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీనియర్ విభాగం కేటగిరిలో రూ.60 వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. ఆరుపండ్ల విభాగం కేటగిరిలో రూ.50 వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.5 వేలను అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9866418478, 9705470369 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం వెలికితీత

బేస్తవారిపేట: మండలంలోని సోమవారిపేట సమీపంలో చీతిరేల కతువలో తేలియాడుతున్న మృతదేహాన్ని ఎస్సై మాధవరావు సోమవారం బయటకు తీయించారు. గత మూడు–నాలుగు రోజులుగా నీటిలో శరీరం మునిగి ఉండటంతో ఉబ్బిపోయింది. ముఖం చేపలు తినడంతో గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. బ్లాక్ అండ్ బ్లూ కలర్ ప్యాంట్, బ్లూ కలర్ సన్న గీతల షర్ట్, మెడలో రుద్రాక్షను ధరించి ఉన్నాడు. కతువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడా, ఎక్కడైనా చంపి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారా, చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదానికి గురై మృతి చెంది ఉండవచ్చననే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



రథంపై ఊరేగుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

● తర్లుపాడులో వేడుకగా సాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు
● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రమణీయం.. వేణుగోపాలుడి రథోత్సవం

తర్లుపాడు: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య కనులపండువగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు గత వారం రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉభయదేవేరులతో కలిపి వేణుగోపాలస్వామిని రథంలో ప్రత్యేకంగా పూలు, బంగారు ఆభరణాలతో శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం జయజయధ్వానాల నడుమ స్వామివారి రథాన్ని భక్తులు ముందుకు లాగారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కల్పన, సోదరి అరుణ, కుటుంబ సభ్యులతోపాటు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సరోజరాణి, పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారికి పూజలు నిర్వహించి రథోత్సవంలో పాల్గొన్నారు. తర్లుపాడుతోపాటు చెన్నారెడ్డిపల్లి, సీతానాగులవరం, మీర్జాపేట, కారుమానుపల్లి, మార్కాపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారి మూల విరాట్‌కు అర్చకులు రమణచార్యులు, రామానుజచార్యులు, సాయి మోహన్ తదితరులు అభిషేకాలు నిర్వహించారు. ధర్మకర్త జవ్వాజీ విజయభాస్కర్‌రావు, ఈఓ చెన్నకేశవరెడ్డి స్వామివారి రథోత్సవాన్ని పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పొదిలి సీఐ సుధాకర్‌బాబు, ఎస్సైలు ముక్కంటి దీపిక, అంకమ్మరావు, సైదుబాబు, ప్రేమ్‌కుమార్, ఏఎస్సై రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తర్లుపాడులో వివిధ ప్రాంతాల్లో భక్తులకు ఆర్యవైశ్య సంఘం, భవనం కుటుంబీకులు, ఇతర దాతల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



వేలాదిగా హాజరైన భక్తులు



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే సతీమణి కల్పన తదితరులు

సరోజిని నాయుడుకు ఘన నివాళి



సరోజిని నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: ప్రముఖ రచయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు జయంతి సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు మంత్రి విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

నిధుల గోల్‌మాల్‌లో ఇద్దరు అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

వేటపాలెం: వేటపాలెం కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ. 24 కోట్లు నిధుల గోల్‌మాల్ కేసులో మరో నలుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీ సురేష్ సోమవారం తెలిపారు. సొసైటీలో 2008 నుంచి 2013 వరకు చుండూరి శ్రీప్రకాష్, చుండూరి వెంకట రమణారావు, జివ్వాజి లక్ష్మీనారాయణ, ఊటుకూరి సూర్యనారాయణలు డైరెక్టర్లుగా పనిచేశారు. వీరు పనిచేసిన సమయంలో సొసైటీలో రూ. 48.50 లక్షలు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు విచారణ అధికారి గుర్తించారు. ఈ మేరకు ఆ నలుగురిపై కేసులు నమోదు చేశారు. 2021 జులైలో నిధులు గోల్‌మాల్ విషయం బయటపడిన సమయంలో సొసైటీలో చైర్మన్‌గా వ్యవహరించిన వలివేటి నాగేశ్వరరావు, సెక్రటరీ (మేనేజర్) శ్రీరాం శ్రీనివాసరావుతో సహా పదిమంది డైరెక్టర్లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అనంతరం మూడు నెలల తరువాత కోర్టులో కండిషన్ బెయిల్ పొంది పదిమంది తిరిగి బయటికి వచ్చారు. ప్రస్తుతం కేసులు నమోదు చేసిన నలుగురిలో జివ్వాజి లక్ష్మినారాయణ, ఊటుకూరి సూర్యనారాయణలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా ఇద్దరికి రిమాండ్ విధించారు. మరో ఇద్దరు డైరెక్టర్స్ చుండూరి శ్రీ ప్రకాష్, చుండూరి వెంకట రమణారావులు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు చీరాల డీఎస్పీ శ్రీకాంత్ పరిధిలో విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీ ఎంపీటీసీపై రౌడీ షీట్



టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామ టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావుపై టంగుటూరు పోలీసులు రౌడీ షీట్ తెరిచారు. గ్రామంలో ఘర్షణలు, ఇతర వివాదాల నేపథ్యంలో ఎంపీటీసీ నాగేశ్వరరావుపై ఇప్పటికే 10 కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు ఫ్లెక్సీల చించివేతపై మరో కేసు నమోదైంది. ఎంపీటీసీపై మొత్తం 12 కేసులు నమోదు కావడం, వివాదాలకు కేంద్ర బిందువుగా ఉండటంతో రౌడీ షీట్ తెరిచామని ఎస్సై ఖాదర్‌బాషా చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల క్లెయిమ్‌లు పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన క్లెయిమ్‌లు ఈ నెల 15వ తేదీ నాటికి తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై ప్రకాశంభవనంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అంశంలో సందేహాలను నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో 1077 నంబర్‌తో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌ను అడిగారు. ఒంగోలు డివిజన్‌లో 8, మార్కాపురంలో 3, కనిగిరి డివిజన్‌లో 1 చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, రవాణా, వెబ్‌కాస్టింగ్ తదితర అంశాల్లో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, సందీప్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: మోటారుసైకిళ్ల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సింగరాయకొండలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం వాసవి గ్రామానికి చెందిన కరణం ప్రసాద్ తన భార్యపై అలిగి ఇంటి నుంచి వచ్చేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై మోటారుసైకిళ్ల చోరీకి పాల్పడుతున్నాడు. ఈ నెల 9వ తేదీన మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలో అమరావతి రోడ్డులో ఓ కార్యక్రమానికి వచ్చిన సింగరాయకొండ పంచాయతీ బుంగబావి ప్రాంతానికి చెందిన నీలిశెట్టి శ్రీను బైక్ చోరీ అయింది. బాధితుడు ఈనెల 11వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీఐ దాచేపల్లి రంగనాథ్ పర్యవేక్షణలో ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా దర్యాప్తు చేపట్టారు. కరణం ప్రసాద్‌ను నిందితుడిగా గుర్తించిన సింగరాయకొండలో అదుపులోకి తీసుకున్నారు. నీలిశెట్టి శ్రీను బైక్‌తోపాటు నెల్లూరు జిల్లా కావలి రైల్వేస్టేషన్ వద్ద దొంగిలించిన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, ఐడీ పార్టీ పోలీసు సిబ్బంది శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన సీఎం జగన్

ఒంగోలు టౌన్: 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని క్వాలిఫైడ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఎం.ఎ న్.విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబరులో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్న వారందరికీ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఇప్పటికే అనేక మంది అభ్యర్థులు మరణించారని, సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి చాలా కాలం గడుస్తుండడంతో అభ్యర్థులు వెంటనే ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుకుంటున్నారన్నారు. క్యాబినెట్ సమావేశంలో 4534 పోస్టుల భర్తీకి ఆమోదం లభించిందని, ఆ సంఖ్యకు మించి అభ్యర్థులు ఉన్నారని వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

● రూ.86,050 నగదు, ఏడు బైకులు సీజ్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు పొలాల్లో పేకాట శిబిరంపై సోమవారం దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్సై దయాకర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి, నిందితుల నుంచి రూ.86,050 నగదు, ఏడు మోటారుసైకిళ్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. సంఘటనా స్థలం నుంచి ఒక వ్యక్తి పరారయ్యాడని, నిందితులు కందుకూరు, ఒంగోలు మండలాలకు చెందినవారిగా గుర్తించామన్నారు. చాలా కాలంగా పోలీసుల కళ్లు గప్పి ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో పేకాట కేంద్రం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు. దాడిలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



కాలిపోయిన పొగాకు బ్యారన్

కంభం: ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమై సుమారు రూ.12 లక్షలు నష్టం వాటిల్లిన ఘటన మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పిడప పద్మావతికి చెందిన బ్యారన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో సుమారు రూ.5 లక్షల విలువ చేసే పొగాకు పూర్తిగా కాలిపోయింది. బ్యారన్లో వస్తువులు, పైకప్పు, ఇతర సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో మరో రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసినా అప్పటికే పూర్తిగా కాలిపోయాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట మంటకు ఆహుతి కావడంతో బాధితురాలు లబోదిబోమంటోంది. నష్టపరిహారం అందేలా చూడాలని అధికారులను వేడుకుంటోంది.

లక్కవరం చెరువు వేలం ఆదాయం రూ.25.10 లక్షలు



వేలంలో హక్కు దక్కించుకున్న నరసింహారెడ్డి

తాళ్లూరు: లక్కవరం మైనర్ ఇరిగేషన్ పెద చెరువులో మూడేళ్లపాటు చేపలు పెంచుకునేందుకు మంగళవారం పంచాయతీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలాన్ని గ్రామ సర్పంచ్ నన్నం వరలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, ఈఓఆర్డీ ఎస్‌యూ ప్రసన్నకుమార్, గ్రామ కార్యదర్శి నూరుల్లా, బీకేపాడు గ్రామ కార్యదర్శి షహనాజ్ బేగం పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన లోకిరెడ్డి వెంకట నరసింహారెడ్డి రూ.25.10 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. గ్రామ నాయకులు తూము వెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పెద్దయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు హనుమారెడ్డి పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి రైల్వే ఓవర్ బ్రిడ్జివద్ద చోటుచేసుకోగా మంగళవారం వెలుగుచూసింది. జీఆర్పీ ఎస్సై సీహెచ్. కొండయ్య వివరాల మేరకు.. స్థానిక రైల్వే స్టేషన్‌కు సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పట్టాలపై పడిఉన్నాడనే సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు దాదాపు 55 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడి జేబులో కారంచేడు–చీరాల వరకు బస్సు టిక్కెట్టు ఉన్నట్లు చెప్పారు. మృతుడు తెల్లషర్టు, తెల్ల పంచ ధరించి ఉన్నాడని, మెడలో ఎరుపు, తెలుపు దారం ఉందని చెప్పారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే జీఆర్పీ ఎస్సై 94406 27646 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.